ప్రజాశక్తి
బుధవారం 8 ఫిబ్రవరి 2023

17న సాలూరులో మెగా జాబ్ మేళా

కలెక్టరేట్: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుఉ ఈనెల 17న మెగా జాబ్ మేళాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ చెప్పారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంటు ఎక్సేంజ్, సీడ్‌ఎపి సంస్థల ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 935 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలు లభించే ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుండి 30 ఏళ్ల వయస్సు గల పురుషులు, మహిళలు మేళాకు అర్హులని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ వారి విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు rb.gy/vyqidv లింకు నందు రిజిస్టరు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 6305110947, 8555909899, 6303493720 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సర్వశిక్ష ఎపిసి సరెండర్

- డిఇఒకు బాధ్యతలు అప్పగింత
- ప్రజాశక్తి కథనానికి స్పందించిన కలెక్టర్

వైసిపి ఏజెంట్‌లా ఎపిసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విఎ స్వామినాయుడును బాధ్యతలు నుంచి తప్పించి మాతృ శాఖకు పంపిస్తూ జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 6న ఆదివారం ఎపిసి స్వామినాయుడు కెజిబివి ప్రత్యేకాధికారులు, టీచర్లతో జెడ్‌పి సమావేశ మందిరంలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థితో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా అధికారై ఉండి రాజకీయ పార్టీ సమావేశానికి రావాలని లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వడం పట్ల పెద్దఎత్తున జిల్లాలో చర్చ జరిగింది. దీన్ని టీచర్లంతా తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తిలో 'వైసిపి ఏజెంట్‌లా ఎపిసి' అంటూ కథనం ప్రచురితమైంది. మరోవైపు పలు ప్రజాసంఘాలు, సిఐటియు, సిపిఎం నాయకులు ఎపిసిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు నెలల క్రితం కూడా ఎపిసి వ్యవహారం, ఆయన విధుల నిర్వహణపై ప్రజాశక్తిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజా ఘటనతో ఎపిసి వ్యవహారంపై జిల్లా కలెక్టర్ అరా తీశారు. మరోవైపు నాలుగు రోజులు పాటు సెలవు పెట్టిన ఎపిసి స్వామినాయుడు తన పైఅధికారి డిఇఒకు కూడా చెప్పకుండా సెలవుపై వెళ్లిపోయారు. ఇప్పటికే ఎపిసి వ్యవహార శైలిపై ఉద్యోగులు నుంచి వ్యతిరేకత రావడం, ఆయనపై పలు ఫిర్యాదులు కూడా వెళ్లడంతో విద్యాశాఖ మంత్రి బొత్స సీరియస్ అయినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఎపిసిని బాధ్యతలు నుంచి తప్పించి మాతృ శాఖకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిఇఒ లింగేశ్వర రెడ్డికి ఎపిసిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎపిసిని సస్పెండ్ చేయాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి వత్తాసు పలుకుతున్న సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ స్వామినాయుడును విధుల నుంచి సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సెలవు రోజున అధికార వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా కెజిబివి ఉద్యోగులతో ఎపిసి సమావేశం నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ఇటువంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. అధికార పార్టీ మీద అభిమానం ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి పని చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా ఇటువంటి విధానాలు మాను కోవాలన్నారు. ఎమ్మెల్సీ ఓట్లు నమోదులో కూడా అక్రమాలు జరిగాయని, చదువు లేని వారిని ఓటర్లుగా చేర్పించారని అన్నారు. ఇప్పటికే బోగస్ ఓట్లుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎపిసిపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మంగళవారం వెలువడిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. వీరఘట్టంకు చెందిన వారణాసి దీపేష్ 99.96 శాతం పర్సంటేల్ సాధించాడు. ఒకటో తరగతి 5 వరకు పార్వతీపురం సురేష్ రెసిడెన్స్ పాఠశాల, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ గుంటూరు భాష్యంలో విద్యను కొనసాగిస్తూ జెఇఇ మెయిన్స్ పరీక్షలో సత్తా చాటడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, శ్రీదేవి, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతిభ చాటిన గుణవంత్

మండల కేంద్రానికి చెందిన వడ్డాది శ్రీసూర్యగుణవంత్ జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 99.14శాతం మార్కులతో సత్తా చాటుకున్నాడు. గుణవంత్ ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు రాజాం డివివి స్కూల్లో విద్యను అభ్యసించాడు. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకూ విశాఖలోని శశి స్కూల్లో విద్య కొనసాగి స్తున్నాడు. ఈ మేరకు తల్లిదండ్రులు రవిరాం, వసుంధరరాణితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

హెపటైటిస్-బి పట్ల అవగాహన కల్పించాలి

కలెక్టరేట్: హెపటైటిస్-బి పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. హెపటైటిస్ బి అవగాహనపై జిల్లా కలెక్టర్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి జగన్నాథరావు పాటు పలువురు వైద్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, హాజరైన జెసి ఐటిడిఎ పిఒలు, డిఆర్ఒ

జిల్లాకు 182 మొబైల్ టవర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాకు కేంద్ర ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ 182 మొబైల్ టవర్లను మంజూరు చేసిందని, వీటిని జూన్ నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మొబైల్ ఆపరేటర్లను ఆదేశించారు. మంజూరు అయిన టవర్లలో ఎయిర్ టెల్ కు 34, జియోకు 75, బిఎస్ఎన్ఎల్‌కు 73 ప్రదేశాల్లో టవర్ల నిర్మాణానికి కేటాయించారు. ఇందులో జియ్యమ్మవలస మండలంలో 7, కొమరాడలో 21, గుమ్మలక్ష్మీపురంలో 52, కురుపాంలో 32, పాచిపెంటలో 18, సాలూరులో 21, సీతంపేటలో 27, మక్కువలో 2, భామిని, పార్వతీపురం మండలాల్లో ఒక్కొక్కటి నిర్మించనున్నారు. నిర్మాణాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, మొబైల్ ఆపరేటర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాను అభ్యుదయ జిల్లాగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు వల్ల జిల్లా అభివృద్ధికి నాంది పడుతుందని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చి, జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. మారు మూల గ్రామాల్లో టెలీ మెడిసిన్ వంటి వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేస్తుందని, గ్రామ సచివాలయం వ్యవస్థ మరింత సమర్ధవంతంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. వీటి దృష్ట్యా జూన్ నాటికి టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎయిర్ టెల్‌కు 22 స్థలాలు, జియోకు 48 స్థలాలు, బిఎస్ఎన్ఎల్ కు 53 స్థలాలు అప్పగించగా, వీటి ప్రాథమిక పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో అవసరమైతే గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారుల సహాయ సహకారాలు తీసుకుని పనులు వేగవంతం చేయాలని అన్నారు. అటవీ ప్రాంతంలో నిర్మాణాలపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారుల ద్వారా అటవీ శాఖకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. బిఎస్ఎన్ఎల్ పనులు తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. ఇప్పటికే ఎయిర్‌టెల్ 25, జియో 44చోట్ల పనులు ప్రారంభించగా, బిఎస్ఎన్ఎల్ త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికార్లు బి.నవ్య, సి.విష్ణు చరణ్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, ఎయిర్ టెల్, బి.ఎస్.ఎన్.ఎల్, జియో ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

బాలికలపై అత్యాచారం కేసులో

ముద్దాయికి యావజ్జీవ కారాగారం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కురుపాం మండలం రావాడ డ్యాం పరిసర ప్రాంతాల్లో 2022 జనవరిలో ఇద్దరు గిరిజన బాలికలను బెదిరించి, అత్యాచారానికి పాల్పడ్డ కేసులో ముద్దాయి వెలగాడ రాంబాబుకు యావజ్జీవ కారాగార శిక్షను విజయనగరం జిల్లా స్పెషల్ సెషన్‌కోర్టు న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022 జనవరి 1న కొత్త సంవత్సరం సందర్భంగా ఇరువురు గిరిజన బాలికలు తమ స్నేహితులతో రావాడ డ్యాం దగ్గర విహరిస్తుండగా చినమేరంగికి చెందిన వెలగాడ రాంబాబు వారి స్నేహితులను బెదిరించి, ఇద్దరి బాలికలను వారి వసతి గృహానికి తీసుకెళ్తానని మభ్యపెట్టి, బైక్‌పై ఎక్కించుకుని, మార్గమధ్యలో వీరిపై అత్యాచారం చేశాడు. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి ముద్దాయిని వెంటనే అదుపులోకి తీసుకుని, గిరిజన బాలికలపై అత్యాచారం జరిగిన నేరంపై కురుపాం పోలీసు స్టేషన్‌లో నాలుగు కేసు నమోదు చేశారు. ఈ కేసులో జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టు విజయనగరం, వారు ముద్దాయిపై ఉన్న ఒక్కో సెక్షన్‌ను విచారించి సెక్షన్ 341 ఐపిసికి ఒక నెల జైలు శిక్ష, రూ.500 జరిమానా, సెక్షన్ 384 ఐపిసికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా, సెక్షన్ 419 ఐపిసికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 506 (2) ఐపిసికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 376 ఐపిసి అండ్ సెక్షన్ 4 ఆఫ్ ఫోక్సో యాక్ట్‌లో జీవిత ఖైదు, రూ.20వేలు జరిమానా విధించారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు అండ్ ఇన్చార్జ్ స్పెషల్ ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ జడ్జి షేక్ సికిందర్ బాషా మంగళవారం తీర్పు ప్రకటించిన ఈ కేసులో బాధితులకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు చొప్పున ఇద్దరికి రూ.10లక్షలు నష్టపరిహారం అందించాల్సిందిగా తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శంకరరావు కేసును వాదించారు. ఈ కేసును అప్పటి సిఐ టివి తిరుపతిరావు దర్యాప్తు చేసినట్లు ఎస్పీ ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఎఎస్‌పి దిలీప్‌కుమార్, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ ఎఎస్‌వి ప్రభాకరరావు పాల్గొన్నారు.

రైతులంతా ఇ-కెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో రైతులంతా ఇ-కెవైసీ చేయించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. పిఎం కిసాన్, వైఎస్ఆర్ రైతుభరోసా, ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులంతా తప్పని సరిగా ఇ-కెవైసీ చేయించుకోవాలని తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, అనుబంధ శాఖలైన ఉద్యాన వన, పశు సంవత్సర్ధక, మత్స్య శాఖల్లో అమలవుతున్న పథకాల పురోగతిని కలెక్టరు సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ రైతులు పిఎంకిసాన్, రైతు భరోసా, ఇతర సంక్షేమ పథకాలు పొందేందుకు ఇ- కెవైసి తప్పని సరిగా చేయించాలని, లేనిచో వారు పథకాలు పొందేందుకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండొచ్చని తెలిపారు. ప్రతి రైతు సచివాలయంలో గల గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఇ-కెవైసీ చేయించుకోవాలన్నారు. మార్చి మొదటి వారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో కస్టమర్ హైరింగ్ సెంటర్లు పనిచేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొదటి విడతగా జిల్లాలో 142 సెంటర్లకు బ్యాంకు అక్కౌంట్లు తెరచి, రుణం మంజూరు చేయాలని, మార్చి మొదటి వారం నాటికి పరికరాలు తెప్పించాలని అన్నారు. రబీ పంటకు సంబంధించి ఇ-పంట నమోదు పూర్తిచేయాలని, విఆర్ఒ, విఎఎలచే ఆథరైజేషన్ చేయించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల పనితీరును క్రోడీకరించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ యాప్ నందు పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఆర్ఒఎఫ్ఆర్, కౌలు రైతులకు పంట రుణాలు మంజూరులో దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. మత్స్యశాఖకు సంబంధించి జనవరికి 68 యూనిట్లు లక్ష్యం కాగా 42 యూనిట్లకు రుణాలు మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన యూనిట్లకు కూడా వెంటనే రుణం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని సబ్‌కలెక్టరుకు వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని మండలంలోని నడుకూరు, దశమంతపురం, కిమ్మి, గడగమ్మ కొట్టు, గుమ్మడ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం నడుకూరులో సబ్‌కలెక్టర్ నూరూల్ కమర్ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తమ వద్ద నుంచి ధాన్యం కొనుగోలు లేకపోవడంతో కళ్లాల్లో కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంట కూడా అమ్ముకునే పరిస్థితి రైతులకు లేదా? అని సబ్‌కలెక్టర్‌ను ప్రశ్నించారు. ఎక్కడికక్కడ కుప్పలు, కుప్పలుగా ధాన్యం బస్తాలు పేరుకు పోతున్నాయని, ప్రస్తుతం ధాన్యం నిల్వలు ఉండడం వల్ల ఎండల ప్రభావం కారణంగా ఎండి అయిపోతున్నాయని తెలిపారు. ఇప్పుడు 84 కేజీలకు బదులు 87 కేజీలు తూనికలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని సబ్‌కలెక్టర్‌ను అన్నదాతలు వేడుకున్నారు.

వికలాంగునికి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వికలాంగులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

వికలాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మంగళవారం తన నివాసంలో జిల్లా వికలాంగుల, వృద్ధుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 8మంది వికలాంగులకు రూ.22లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వికలాంగుల జీవనోపాధి మెరుగుకు ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌డిసి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలను వికలాంగులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాజన్నదొర ఆకాంక్షించారు. ఇంకా అర్హులుంటే గుర్తించి వారికి కూడా సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగుల, వృద్ధుల సంక్షేమ సంస్థ ఎడి ఎం.కిరణ్ కుమార్, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

కేంద్ర రవాణా రంగ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ మహాధర్నాలో డ్రైవర్లంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆటో అండ్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రూ.2 లక్షల 79వేల కోట్లను పన్నుల రూపంలో గుంజుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రవాణా రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి చూపించారన్నారు. ప్రతి ఏటా వాహన ఇన్సూరెన్స్ కంపెనీలు 20శాతం ప్రీమియంను పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సవరించిన రవాణా రంగ చట్టం వీలు కల్పించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లపై 302(ఎ) సెక్షన్ కింద అరెస్టు చేసేందుకు అవకాశం కల్పించిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, ప్రమాదాలకు కారణాలుగా డ్రైవర్లను మాత్రమే బాధ్యులను చేయడం, రాష్ట్రంలో రహదారులు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని, రోడ్ల మరమ్మతులకు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.1 రూపాయి చొప్పున సెస్ విధించి, కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రోడ్డు టాక్స్ 30 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది చాలదన్నట్టు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తానా అంటే తందానా అన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దారుణం అన్నారు. రవాణా రంగ చట్ట సవరణ ద్వారా బడా కార్పొరేట్ కంపెనీలైన ఉబర్, ఓలా వంటి సంస్థల వాహనాలకు పట్టణాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, తమ స్వయంశక్తితో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలాలు కేటాయించడం లేదని విమర్శించారు. ఉబర్, ఓలా వంటి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రవాణారంగ కార్మికుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేరళ తరహా ఆన్లైన్ యాప్‌ను రూపొందించి ఉబర్, ఓలా కంపెనీల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వాహనాలపై విధిస్తున్న చలానాలను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రవాణా రంగ కార్మికులందర్నీ ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధమవుతానని హెచ్చరించారు.

కొత్తగా ఎన్నికైన ఆటో అండ్ ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎన్నిక....

ఆటో అండ్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షులుగా కాద రాము, ప్రధాన కార్యదర్శిగా కె. సూర్యం, ఉపాధ్యక్షులుగా కాయల శ్రీనివాసరావు, కోశాధికారిగా దూసి పాపారావు, కార్యదర్శిగా బి. దుర్గారావు, కార్యవర్గ సభ్యులు బి. పట్టాభి తదితరులను ఎన్నుకున్నారు.

అరకొర సౌకర్యాలతో చదివేదెలా?

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక బైపాస్ రోడ్డులో గల గిరిజన సంక్షేమ పోస్టు మెట్రిక్ కళాశాల బాలురు వసతి గృహంలో అరకొర సౌకర్యాలతో పాటు భోజనాలు బాగోకపోవడంతో మంగళవారం విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు భోజనం చేయకుండా ఆకలితో నిరసన దీక్ష చేపట్టారు. డిడి రావాలని విద్యార్థులు పట్టుబట్టడంతో సమాచారం అందుకున్న డిడి సత్యనారాయణ హాస్టల్‌కు వచ్చి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇన్ని నెలలుగా హాస్టల్ సందర్శనకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. హాస్టల్‌లోని సమస్యలను వార్డెన్ కృష్ణమోహన్‌కు పలుమార్లు తెలిపినా పరిష్కరించకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఆందోళన వద్దకు ఎస్ఐ ఫకృద్దీన్ వచ్చి విద్యార్థుల సమస్యలు చాలా తీవ్రమైనవని వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అధికారుల ఇచ్చిన హామీతో విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళనను విరమించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ 420మంది విద్యార్థులు ఉండే హాస్టల్‌కు రెండే మరుగుదొడ్లు ఉన్నాయని, దీనివల్ల మలమూత్ర విసర్జనకు అరుబయటకు వెళ్తున్నారని అన్నారు. అలాగే ప్రహరీగోడ లేకపోవడంతో పందులు, పశువులు గదుల్లోకి వచ్చి నిద్రిస్తున్నాయన్నారు. ఒకే పైపులైన్ ఉండడంతో స్నానానికి ఇబ్బందిగా ఉందని, దీనివల్ల సకాలంలో కాలేజీలకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. ప్రతి గదిలో 30 మంది విద్యార్థులకు ఒకే లైటు, రెండు ఫ్యాన్లు ఉన్నందున చదవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తాగడానికి మంచినీరు లేక బయట నుంచి తెచ్చుకుంటున్నామని, ఆర్వో ప్లాంట్ శిలావిగ్రహంలాగే మిగిలిందని అన్నారు. మెనూ సక్రమంగా అమలు లేదని, దీనివల్ల ఆహారం రుచికరంగా ఉండకపోవడంతో చెత్తబుట్టలకే పరిమితమవుతున్నాయని తెలిపారు. ఇన్ని సమస్యల మధ్య రాబోయే పబ్లిక్ పరీక్షలో ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని అధికారులను ప్రశ్నించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యతులో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షులు కె. భాస్కర్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో చర్చిస్తున్న అధికారులు

భోజనాలు బహిష్కరణ
విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

హాస్టల్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డి నాగరాజు

తడి, పొడి చెత్త వేరు చేయాలి

సాలూరు : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానం వందశాతం అమలు కావాలని మున్సిపల్ ఆర్‌డి జి.నాగరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్, వనరుల పార్కును పరిశీలించారు. యార్డులో తడి చెత్త నుంచి ఎరువు తయారు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. పట్టణంలోని ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్త వేరు చేసే విధానం అమలు చేయాలని పర్యావరణ కార్యదర్శులకు ఆదేశించారు.ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు వున్నారు.

కెజిబివిని పరిశీలించిన డిప్యూటీ డిఇఒ

భామిని : స్థానిక కెజిబివి పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి విజయకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెనూ, తరగతులు, పాఠశాలలో శానిటేషన్ నిర్వహణ, పాఠశాల రికార్డులను పరిశీలించి అనంతరం విద్యా అంశాలపై విద్యార్థులతో మాట్లాడి, ప్రణాళిక ప్రకారం, ప్రతి రోజూ చదివి 10వ తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు మంచిగా రాణించాలని అన్నారు. చదివితే కచ్చితంగా మంచి మార్కులు సాధించగలరని విద్యార్థులకు సూచించించారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, కెజిబివి ఎస్ఒ బి.శారద, ఉపాధ్యాయులు ఉన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

భామిని : మండలంలోని పసికిడి వద్ద సోమవారం రాత్రి ఏనుగుల దాడిలో ఎలిఫెంట్ ట్రాకర్ లోకుండ లక్ష్మీనారాయణ దారుణంగా మతి చెందాడని, అతని కుటుంబానికి రూ.25లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. బాలేరులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో నెలరోజుల్లో ఏనుగులు దాడిలో ఇద్దరు మరణించడం చాలా బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర భయందోళనకు గురవుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే ఏనుగుల తరలిం పునకు, ప్రజల ప్రాణాలు కాపాడ్డానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ జి.జగన్నాయకులు, కె.మిన్నారావు పాల్గొన్నారు.

ట్రెంచ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం : కొండ ప్రాంతాల్లో కందకాల తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. మండలంలోని బాలేశు పంచాయితీ, రేగిడిలో కొండ ప్రాంతాల్లో వాటర్ అబ్జర్వేషన్ ట్రెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో వీటిని పరిశీలించేందుకు వచ్చిన పీడీ పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడిన నేపథ్యంలో కొండ ప్రాంతాలపై పడిన వర్షపు నీరు, విలువైన జిగురు మట్టి వృథాగా పోకుండా ఉండేందుకు కొండ చుట్టూ కందకాలను తవ్వడం చేస్తే ఆయా కొందకాల్లో వర్షపు నీరు, జిగురు మట్టి చేరి కొండపైన ఉన్న అడవులు సక్రమంగా, సారవంతంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా కందకాల తవ్వకాల పనులను సకాలంలో సిబ్బంది పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎపిఒ డి.శివరామకృష్ణ, జెఇ మనోజ్ కుమార్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి : తహశీల్దార్

వీరఘట్టం : సక్రమంగా విధులు నిర్వహించాలని ఇన్‌ఛార్జి తహశీల్దారు చందక సత్యానారాయణ విఆర్‌ఒలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విఆర్‌ఒలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చందక సత్యానారాయణ మాట్లాడుతూ భూ సర్వేను వేగవంతం చేయాలన్నారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే ధ్రువపత్రాలు మంజూరులో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అందరికీ అందుబాటులో ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఒ జి.ప్రసాదరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాలకు ఎంపిక శిబిరం

కురుపాం : నియోజకవర్గ కేంద్రమైన కురుపాం భవిత కేంద్రంలో మంగళవారం కురుపాం, గుమ్మలక్ష్మి పురం, జియ్యంవలస మండలాల వికలాంగుల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల ఎంపిక శిబిరం స్థానిక ఎంఇఒ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ మూడు మండలాల నుంచి 65మంది విద్యార్థులు ఎంపిక శిబిరానికి హాజరు కాగా, 52 మంది విద్యార్థులకు ఉచిత ఉపకరణాలకు అర్హులుగా గుర్తించామని అన్నారు. వీరికి ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్ పి.భానుమూర్తి, ఐఇఆర్‌టి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతంపేట : మండలంలోని దేవనాపురం పంచాయతీ లక్కయ్యగూడలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న టెర్రషింగ్ పనులను ఎంపిడిఒ కె.గీతాంజలి పరిశీలించారు. కనీసవేతనాలు రావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దావనాపురం సచివాలయం సందర్శించారు. పది రోజుల్లో 30 సర్వీస్‌లు ఇవ్వడం బాగానే ఉందన్నారు అనంతరం కమ్యూనిటీ రచ్చబండ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అన్నారు. బాలల సంరక్షణ కమిటీ ద్వారా కార్యదర్శులు పిల్లలకు వేధింపులు జరగకుండా చూడాలన్నారు.

ఆధార్ శిబిరం సందర్శన

సీతంపేట : స్థానిక కెజిబివి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ మంగళవారం సందర్శించారు. సాంకేతిక సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిబిరం ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో గల మండలో డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక 104 వైద్యులు డాక్టర్ గుడివాడ ప్రభాకర్ రావు, పైల అభిలాష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి 86 మంది రోగులు హాజరు అయ్యారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్ పి మౌనిక, హెల్త్ అసిస్టెంట్ ఎన్. రత్న ప్రసాద్, వైద్య సిబ్బంది కాంచన, ఆశాలు సుజాత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు కృషి

కురుపాం : టెన్త్, ఇంటర్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కెజిబివి ఎఫ్ఎఒ కె.జోగునాయుడు అన్నారు. మంగళవారం స్థానిక కెజిబివి, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక, నాడు - నేడు పనులను స్టాక్ రిజిస్టులను పరిశీలించారు. సిబ్బందికి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎజిసిడిఒ రోజా రమణి, కెజిబివి ప్రిన్సిపల్ ఐ.కిరణ్‌కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

స్టోర్ రూమను పరిశీలిస్తున్న ఎఫ్ఎఒ జోగునాయుడు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో పిహెచ్‌సిల వద్ద నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈనెల 20న కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కె.ఆర్.బి.పురం పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరసన అనంతరం రాంభద్రపురం, కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారులు గణేష్, శిరీషకు వినతిని అందజేశారు. తొలుత సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకుల రాజేశ్వరి, హేమలత, హైమా మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.10వేలు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ప్రతినెలా పూర్తి స్థాయిలో వేతనం ఇవ్వడంలేదన్నారు. దీంతో అర్ధాకలతో జీవనం సాగిస్తున్నారన్నారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.4వేలు వేతనం ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇది కూడా ప్రతి నెలా వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో వీరు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వెటర్నరీ లీవ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా, సిహెచ్‌డబ్ల్యుఒలు మంగ, లక్ష్మి, పార్వతి, సుభద్రమ్మ, గంగమ్మ, లక్ష్మి, సుజాత, సునీత, రాధా తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని గురువు నాయుడుపేట, పాచిపెంట పిహెచ్‌సిల వద్ద ఆశా, సిహెచ్ డబ్ల్యూలు సిఐటియు ఆధ్వర్యంలో పిహెచ్‌సి పరిధిలో గల వైద్యాధికారులకు వినతులను అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జి.నిర్మల, ఎం.చండీదేవి, కమల నాయకత్వంలోనూ, గురునాయుడుపేట పిహెచ్‌సిలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.నాగవేణి, కె.నిర్మల ఆధ్వర్యంలో జరిగింది. వీరి ఆందోళనకు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ఆశాలకు ఎఎన్‌ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని, సిహెచ్‌డబ్ల్యులకు ఆశాలతో సమాన వేతనం చెల్లించాలని, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రతినెలా వేతనం ఐదో తేదీ లోపు చెల్లించాలని అన్నారు. పై సమస్యల పరిష్కారానికి ఈనెల 20న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు హాజరైన విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

కొమరాడలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులు

పాచిపెంటలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులు

సాలూరు రూరల్ : తోణాం పిహెచ్‌సి పరిధిలో పనిచేసే సిహెచ్‌డబ్ల్యులకు గత కొంతకాలంగా జీతాలు చెల్లించలేదని, సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని పిహెచ్‌సి వైద్యాధికారి సుజాతకు సిఐటియు ఆధ్వర్యాన వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులకు చాలీచాలని జీతాలతో బతుకుతున్నారని, వెట్టిచాకిరి చేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పిహెచ్‌సి పరిధిలో గల సిహెచ్‌డబ్ల్యులు రవణమ్మ, ఎం.రమణమ్మ, సిఐటియు జిల్లా సహా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్వరాజ్యం విజయవంతం అవుతుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లబురిడిలో రూ.42లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.22లక్షలతో నిర్మించిన రైతుభరోసాకేంద్రాల నూతన భవనాలను నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి ప్రారంభించారు. అనంతరం మానమ్మకం నువ్వేజగనన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని 10 సచివాలయాలకు చెందిన వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, సమర్ధవంతమైన నెట్‌వర్క్ ఏర్పాటులో భాగమే జగనన్న సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు ఏర్పాటు అన్ని అన్నారు. కొత్తగా నియమింపబడిన వారు తమ బాధ్యతలపై అవగాహన పెంచుకుని, ప్రజలకు చేరువకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్‌జావేద్, పిఆర్ ఇఇ కృష్ణాజీ, డిఇలు, ఎఇలు, జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జిశోభారాణి, ఎంపిటిసి మంగమ్మ, నాయకులు బలగ నాగేశ్వరరరావు, బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, మజ్జిచంద్రశేఖర్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సీతానగరం

అర్హతనే ప్రామాణికంగా చేసుకొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని, ప్రభుత్వం మనది - వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అంతా కలిసి పని చేయాలని నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి గృహసారథులకు పిలుపునిచ్చారు. మండలంలోని బూర్జిలో రెండో విడత శిక్షణా కార్యక్రమంలో భాగంగా మిగతా 8 సచివాలయంల పరిధిలో గల గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లతో కలిసి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, శోభా హైమావతి పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ఈనెల 11 నుంచి గృహసారథులు, కన్వీనర్లు వాలంటీర్ల సహాయంతో ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం వారికి చేసిన మేలును వివరించడంతో పాటు ప్రచార సామగ్రిని వారికి అందజేయాలన్నారు. అనంతరం హైమావతి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ఎంతో ఉత్తేజంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో త్వరలోనే 200 రోజులు కార్యక్రమం పూర్తి చేసుకోబోతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో పార్టీని విజయపథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ ఎ.కృష్ణంనాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు బి.చిట్టి రాజు, బి.శ్రీరాములునాయుడు, ఆర్‌వి పార్థసారధి, వెంకట అప్పల నాయుడు, స్థానిక సర్పంచ్ దాసు, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణతో పాటు పలు గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

రక్త హీనత నివారణే ధ్యేయం కావాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్

రక్త హీనత నివారణ ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళ వారం వైద్య ఆరోగ్య శాఖ పనితీరునుకలెక్టర్ సమీక్షించారు. రక్త హీనత నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. రక్తహీనత నివారణకు తీసుకుంటున్న చర్యలు, మందుల వినియోగం, అవగాహన కార్యక్రమాలు పరిశీలించాలని అన్నారు. 10 నుండి 19 ఏళ్ల కిషోర్ బాలికలపై శ్రద్ధ వహించాలని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, ప్రసవానికి ముందు, తరువాత పరిస్థితులు గమనించాలనిపేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పోషకాహార వివరాలు గమనించాలని అన్నారు. మాతృ మరణాలు గణనీయంగా తగ్గాలని స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. 108 వాహనంలో ప్రసవాలు జరగడం కాదని, ముందస్తు చర్యల్లో భాగంగా గర్భిణీ, బిడ్డ ప్రాణాలకు హాని లేకుండా ఆసుపత్రుల్లో చేర్చాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టరు విధానంలో ప్రతి రోజు కనీసం 1400 ఒపి జరగాలన్నారు. వాక్సినేషన్ శత శాతం సాధించాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టరు విధానంలో గ్రామాల్లో పర్యటించి సచివాలయంలో జాబితాలను విధిగా పరీక్షించాలని ఆయన పేర్కొన్నారు. మలేరియా, డెంగ్యూ కేసులు పెరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తాడికొండ పి.హెచ్.సి పరిధిలో అన్ని అంశాల ప్రగతి బాగా తక్కువగా ఉందని, దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆర్.బి.ఎస్.కె ప్రాజెక్టు అధికారినికలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, ఆర్.బి.ఎస్.కె ప్రాజెక్టు అధికారి ధవళ భాస్కరరావు, డెప్యూటీ డిఎంహెచ్ఒలు పార్వతి, వెంకట రమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. టి. జగన్మోహన రావు, సీతంపేట సిహెచ్‌సి సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

99 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పిహెచ్‌సి పరిధిలో గల మండలో మంగళవారం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో 99మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి, మార్కెట్ మేనేజర్ మధుశ్రీ ఆప్తాలమిక్ అసిస్టెంట్ భీమాశంకరరావు, సిబ్బంది పాల్గొని వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 19 మందికి కేట్రాక్ ఆపరేషన్‌కు అర్హులుగా గుర్తించారు. ఈ 19 మందిని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి వాహనంలో విజయనగరం తీసుకుని కేటరాక్ట్ ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ప్రభాకరరావు, డాక్టర్ పైల అభిలాష్ సహకారం అందించారు. ఈ వైద్య శిబిరానికి మండ, మల్లు గూడ, ఎగుమండ, కుంటుబాయి, టిక్క బాయి గ్రామాలకు చెందిన రోగులు హాజరయ్యారు. రోగులకు ఆహారాన్ని విశ్రాంత ఎంపిహెచ్ఒ ఆరిక దేవుళ్ళు అందజేశారు. ఈ వైద్య శిబిరం స్థానిక సర్పంచ్ హేమావతి, ఎంఎల్ హెచ్ పి పి.మౌలిక, ఆరోగ్య సహాయకులు ఎన్.రత్న ప్రసాద్, ఎఎన్ఎం కె.కాంచన తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐ ఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈ మేరకు ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేసి ప్రగతి నివేదికలను పరిశీలించారు. ఆశా కార్యకర్తలకు ఇచ్చిన మొబైల్‌లను (ఇ - ఆశా యాప్) వినియోగించి క్షేత్ర స్థాయిలో చేపట్టే ఆరోగ్య కార్యక్రమాలను నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులను, నవజాత శిశువుల గృహ సందర్శనలు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. ఆశాలకు ఇచ్చే హెచ్‌బిఎన్‌సి కిట్లను ఉపయోగించాలని, అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అలాగే ప్రతి నెలా గ్రామ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార కమిటీల సమావేశం నిర్వహించి, చర్చించిన అంశాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, ఎనీమియా ముక్త్ భారత్, లెప్రసీ సర్వే, ఎన్ సిడి - సిడి సర్వే, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ తదితర కార్యక్రమాలపై డిఐఒ జగన్మోహన్ సమీక్ష చేసి వీటి ప్రగతి నివేదికలు పక్కాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులను గుర్తించాలి

వీరఘట్టం : గ్రామాల్లోనే గర్భిణీలను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసే విధంగా చూడాలని స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. గర్భిణీలకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు గర్భిణులను తీసుకెళ్లాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరుపుకొనేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, శాంతకుమారి, నవోనమ్మ, ఎఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హిజ్రాల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రం హిజ్రాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల, హిజ్రాల సంక్షేమ సంస్థ ఎడి ఎం. కిరణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక నీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించిన హిజ్రాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులతో పాటు హిజ్రాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ హిజ్రాలను సమాజంలో వున్న అన్ని వర్గాల ప్రజలతో సమానంగా ప్రభుత్వం పరిగణిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపకులు దవడ కొండబాబు, స్థానిక హిజ్రా నాయకులు కృష్ణవేణి, విజయదుర్గా, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మజ్జి సత్యనారాయణ, పిహెచ్‌సి సీనియర్ సహాయకులు మధుసూదన్, జిల్లా స్వచ్ఛంద సంస్థల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఎం.తిరుపతిరావు, నీడ్ సిబ్బంది మోహన్, సూర్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించని వాహన చోదకునికి చాక్లెట్ అందజేస్తున్న సిఐ సత్యనారాయణ

హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోండి : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించి తమ జీవితాలను కాపాడుకోవాలని ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ కోరారు.మంగళవారం ఆయన ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ నుంచి గుమ్మలక్ష్మీపురం బిఎస్సార్ కళింగ వైశ్య కళ్యాణ మండపం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం ఎట్టి పరిస్థితుల్లోనూ నడపవద్దని అన్నారు. హెల్మెట్లు ధరిస్తే ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. ఈ మేరకు హెల్మెట్లు లేకుండా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులను హెచ్చరించి చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీ శంకర్రావు, ఎస్ఐ షణ్ముఖరావు, ఎఎస్ఐలు తిరుపతిరావు, శంకర్రావు, పోలీసు సిబ్బంది, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

మార్చినాటికి వంతెన పనులు పూర్తి : డిఇ

ప్రజాశక్తి - వీరఘట్టం

కిమ్మి- రుషింగి గ్రామాల మధ్య నాగవళి నదిపై వంతెన నిర్మాణం పనులు ఈ ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు రోడ్లు, భవనాల శాఖ డిఇ డి.గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం కిమ్మి -రుషింగి గ్రామాల మధ్య చేపడుతున్న వంతెన నిర్మాణ శ్లాబ్ పనులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం 12 , 13 పిఆర్‌ల మధ్య స్లాబ్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. రూ.27 కోట్లతో ప్రతిపాదించగా రూ.20 కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు . ఈ పనులు 2021 నవంబర్ కల్లా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ వర్షాలు అధికం కావడంతో పాటు గుత్తేదారుకు బిల్లులు సకాలంలో అందించుకోవడంతో పనుల్లో జాప్యం జరిగిందని ఆయన అన్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే వీరఘట్ట, వంగర మండలాల ప్రజల చిరకాలవంచ ముగియనుందని స్పష్టం చేశారు. ఆయనతోపాటు సైట్ ఇంజనీరు జనార్ధన ఉన్నారు.

మార్చిలో రహదారి విస్తరణ పనులు

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి నుంచి కురుపాం వరకు మంజూరైన వంటి రహదారి విస్తరణ, నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్అండ్‌బి డిఇ నాగమోహన్ తెలిపారు. మంగళవారం కురుపాం ధూళికేశ్వర్ ఆలయం సమీపంలో గల మెయిన్ రోడ్డు వద్ద రెవెన్యూ సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం మెయిన్ రోడ్డులో మార్చిలో జరుగుతాయని, దీని నిమిత్తం ఇప్పుడు సర్వే చేయడం తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రి ఒకేషనల్ కాలేజీ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

బినామీ అడ్మిషన్లపై నడుపుతున్న గాయత్రి ఒకేషనల్ కాలేజీ అనుమతులు రద్దు చేయాలని ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాయికిరణ్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాయత్రి ఒకేషనల్ కాలేజ్ బినామీ అడ్మిషన్లపై అలాగే పూర్తిస్థాయి ప్రభుత్వ నిబంధనలు పాటించుకున్న కళాశాల నడపడం, అలాగే అధ్యాపకులు కూడా లేకుండా వేలల్లో ఫీజులు తీసుకొని కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. ప్రాక్టికల్ ఫీజులను అధికంగా వసూలు చేయడం, అలాగే విద్యార్థుల దగ్గర్నుంచి సర్టిఫికెట్ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకుంటే ఎపి విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఇంఛార్జి కార్తికేయ, మండల కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్టూ ప్రథమ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా ప్రథమ మహాసభ బుధవారం పట్టణంలోని కంగటివీధిలో గల శ్రీ సూర్యకళా ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని నాయకులు ఎం.గోపాలం తెలిపారు. మహాసభలో ప్రధాన కార్యదర్శి.ఎపిటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్ ప్రారంభోపన్యాసం చేస్తారని, ప్రధానవక్తగా ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, ఎఐకెఎంఎస్, పిఒడబ్ల్యూ, అరుణోదయ జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని వెలగవాడ, సింగన్నవలస సచివాలయాలను ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. వాలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. అలాగే వాటపాగు పంచాయతీ పద్మా పురం, అట్టలి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

గురుకులంలో 'వైఎస్ఆర్ కంటి వెలుగు'

ప్రజాశక్తి -భామిని

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆప్తామాలజిస్ట్ డాక్టర్ ఇప్పిలి జానకిరామయ్య ఆధ్వర్యంలో మూడో విడత వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 460 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపం గల 29 మంది బాలికలకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, మెల్ల కన్ను గల ఇద్దరు విద్యార్థులు త్వరలో మెరుగైన చికిత్స అందిస్తామని, సాధారణ కంటి జబ్బులు గల 59 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశామని ఆప్తామాలాజిస్ట్ తెలిపారు. అనంతరం కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తులపై పిల్లలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ విజయనిర్మల, ఎంఎల్‌హెచ్‌పిలు మౌనిక, నాగలక్ష్మి, రాధ ఉన్నారు.

తాగునీటి బావి కూల్చివేతపై విచారణ

భామిని: మండలంలోని సతివాడలో 25 ఏళ్లుగా తాగు నీటి బావిగా వినియోగిస్తున్న బిల్లింగి వారి పెరడులోని నందల నుయ్యిని గతనెల 19న కూల్చి వేశారు. దీంతో తాగు నీటి సమస్య, పిల్లలు, పశువులు రాత్రి సమయంలో పడిపోయే అవకాశం ఉందని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అలాగే కొరమ గ్రామ కంఠం పరిధిలో గల తాగునీటి బావిని కూల్చి, ఆక్రమణ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం డిఎల్‌పిఒ రాం ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ఎం.మహేంద్ర, ఎ.సుబ్బారావు క్షేత్ర స్థాయిలో పై రెండు అంశాలను పరిశీలించారు. అధికారులు దృష్టికి తీసుకువెళ్లి బావి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.